# అప్పుడూ - ఇప్పుడూ

వాడు కాలేజీలో చేరిం తరువాత కొన్ని యేళ్ళు నేను సుబ్రమణ్యాం మొహం చూడలేదు. ప్లీడరు కాకూడదని మే పట్టిన శపథాలు మరిచి, ప్లీడరు వృత్తి భోగం వృత్తికన్న నీచమని నిశ్చయించుకొని తిట్టిన తిట్లన్నీ దిగదుడుచుకొని, తండ్రి ఆగ్రహానికి జడిసి నీచంగా లా కాలేజీలో పిరికివడ్డై చేరాడనుకొని వాడిమీది అభిమానమంతా మళ్ళించేసుకున్నాను. తరువాత నేను బెంగుళూరు వెళ్ళడం, మా కుటుంబంలో అవస్థలూ, అత్తవారితో తగాదాలు, వీటి మధ్య వాణ్ణి అసలే మరచిపోయాను.

ఇన్సూరెన్సు యేజంటునై తిరుగుతూ, బెజవాడలో ఒకపెద్ద మేడకి సుబ్రమణ్యాం ప్లీడరీచెక్క చూశాను. వెంటనే వాణ్ణి చూడాలనిపించింది.అదిగాక వాడి మేడ విస్తీర్ణంపట్టి వాణ్ణో అయిదు వేలకి యీన్సూరెన్సు బుట్టలో వెయ్యవచ్చని ఆశకూడా పుట్టింది. విశాలమైన హాలులోకి వెళ్ళగానే కాయితాల కట్టల మధ్యా పదిహేనుగురు కింకరులవంటి క్లయింట్ల మధ్యా కొట్టుకుంటున్న వాడు అక్కడ కనపడ్డాడు. నన్ను చూడగానే వాళ్ళని వదిలించుకొని సంతోషంతో లేచి కావిలించుకొని లోపలికి తన గదిలోకి తీసుకెళ్ళి కూచోపెట్టి "యింక నలుగురున్నారు. పంపేసి వస్తాను. యీ బొమ్మల పుస్తకాలు చూస్తో కూచో" అని వెళ్ళాడు.

గది చుట్టూ పటాలు చాలా "టేస్టు"గా అమర్చి వున్నాయి గోడలకి. సంస్కృత కవులూ, యింగ్లీషు కవులూ రచించిన గ్రంథాలుగల చక్కని చిన్న లైబ్రరీ వుంది ఒక మూల. యింకో పక్కన తొక్కుడు హార్మోనియం నిగనిగలాడుతోంది. మెత్తని పరుపుల కుర్చీలో వెన్నువాల్చి గూట్లోంచి నీలపుటాకాశం వేపూ, వూగులాడే పున్నాగ శిఖరాలవేపూ చూస్తో "యేమి అదృష్టమా!" అనుకొన్నాను మళ్ళీ. తలుపు బైటనుంచి కలకలమనే నవ్వులూ, పరుగులెత్తే పిల్లల అరుపులు, వంగసండు చీరె చెరగులూ, బంగారు గాజుల చప్పుళ్ళూ నన్నాకర్షిస్తున్నాయి. చక్కని యింగువ వాసనోసారి తాకింది నా ముక్కుల్ని, బ్రాహ్మణ వేద పఠనమోసారి వినబడ్డది. సుబ్రమణ్యాం వచ్చి స్నానానికి లెమ్మన్నదాక అట్లా గడిచింది కాలం. వాళ్ళ ఐశ్వరమూ, భోగమూ చూస్తే కుచేలుడు కృష్ణుని యింటికి వెళ్ళినట్టుంది. ఆ యింట్లో పెద్ద దగ్గర్నించి చిన్నవరకూ నా స్నేహితుణ్ణి చూస్తే అధికారం, భక్తి, ప్రేమ. అతడేదన్నా మాట్లాడాడో అతన్ని సంతోష పెట్టడం కోసం అందరూ పరిగెత్తుతారు. నౌకర్లు, అతనికి తమ ప్రాణాలర్పించడానికి ఏ మాత్రం సంశయించరు. అతనిలోనుంచి ఎప్పుడూ సంతోషమూ, దయా యితరుల పైకి ప్రవహిస్తో వుంటాయి. అందరు దేవుళ్ళూ అన్ని వరాల్ని అతనిమీద వర్షించినట్లు కనబడుతుంది. ఆనంద నిలయాన్ని, ఆ గృహాన్ని చూస్తే ఎవరిమీదా ద్వేషమూ, ఈర్ష్యా, లోభత్వమూ, విచారమూ అతనిలోనే కాదు, ఆ యింట్లోనేలేవు అని తోస్తుంది. భోజనమై వాళ్ళ గదిలో కూచున్నప్పుడు "ప్లీడరీమీద నీ పూర్వ ఉగ్రం తగ్గిందా?" అన్నాడు. సిగ్గుపడుతో లేదన్నాను.

సు : యింకా నీ అభిప్రాయం మేమందరం నీచుల మనేనా?

నేను : కాకపోతే యివన్నీ ఎట్లా సంపాయించావు?

సు : తలలుకొట్టి దోచుకున్నాననుకుంటున్నావా యేం?

నే : అవును. నిష్కాపట్యానికి నేను ప్రసిద్ధి.

సు : పడ్డ కష్టానికి ఫలితమాసించడం తప్పేనా ?

నే : న్యాయమైన కష్టమైతేగా? అబద్ధాలాడించడమేగా!

సు : సిపాయి యుద్ధంలో చంపుతారు. హంతకుడే ?

నే : ధర్మయుద్ధం న్యాయమే.

సు : ఎదుటివాళ్ళు అధర్మ యుద్ధం చేస్తే?

నే : మనం ధర్మయుద్ధమే చెయ్యాలి?

సు : ఆ విధంగానే మన రాజపుత్రుల్నీ, వాళ్ళనీ నమ్మి మనదేశం నాశనమయింది.

నే : ధర్మం మిగిలింది.

సు : అదేమూలా కనబడదు దేశంలో యిప్పుడు.

నే : కోర్టులో కనబడదు.

సు : కోర్టులో అబద్ధమాడించకపోతే, నీ నిజం అబద్ధమౌతుంది.

నే : ఆబద్ధం ఆబద్ధంచేత నశిస్తుందా?

సు : జీసస్ క్రైస్తులాగ మాటాడకు మరి. కోర్టులో తెలివితక్కువ అబద్ధం, తెలివిగల అబద్ధంచేత నశిస్తుంది.

నే : నశించదు. ప్రజల్లో అబద్ధం యెక్కువవుతోంది.

సు : దేశం తిరిగావుగాని ప్రజల స్వభావం నీకేమాత్రం తెలీదు. యీ పార్టీలకి మేమబద్ధాలు నేర్పుతామనుకున్నావు. వాళ్ళే నేర్పుతారు మాకు. పనికిరాని తెలివితక్కువ అబద్ధాలు ఆడకుండా అవసరమైనవీ, తెలివిగలవీ మాత్రమే ఆడమంటాం మేము.

అతనితోవున్న నాలుగు రోజుల్లో అతని దాతృత్వము, ప్రజాసేవ, ఉత్సాహమూ అన్నీ వ్యక్తమైనాయి నాకు. బారు రూములో అతను ప్రవేశించగానే అందరి మొహాలు విప్పారి నవ్వుతాయి. నీచమూ, అవ్యక్తమూ, అసభ్యమైన మాటలు మాట్లాడ వెరుస్తారు అతని ముందు. అతనికి అందరి మీద విశ్వాసమూ, దయా, భక్తి. ఆ నాలుగు రోజుల్లో నాతో ఒకరిని గురించి నిందాపరంగా ఒక్కమాట మాట్లాడలేదు. అతను తన తోడి మానవుల్నీ, లోకాన్నీ యెంతో ప్రేమిస్తున్నట్టూ, వారినించి సంతోషము పొందుతున్నట్టూ

వున్నాడు. బీదవారికి ఉచితంగా వ్యాజ్యాలు వెయ్యడంలో, బాధలునపడే వారినీ, యితరుల దౌర్జన్యంలో అణిగిపోయిన వారినీ నిలబెట్టి వారికై పోట్లాడడంలో అతను తన జీవితాన్ని సగమిచ్చేస్తాడు. క్లబ్బులో అతను లేనిదీ వాళ్ళకేమీ తోచదు. ఇంక ముఖ్యంగా అతన్ని రాత్రి భోజనంకాగానే పిల్లలతో చూడాలి. ఎక్కణ్నించో ఒక కథ లేక ఆట తీసుకొస్తాడు. గంట రెండుగంటలసేపు ఇల్లంతా రంగస్థలమవుతుంది. ఆ పిల్లలు ముగ్గురు ఎప్పుడూ ఆడుతూ, పాడుతూ విచారమూ, దెబ్బలు భయమూ యేమీలేక ముచ్చట కొలుపుతో వుంటారు. నే వెళ్ళే ముందు పదివేల రూపాయలు యిన్సూరెన్సుచేసి, ఠాగూరు పుస్తకాలు నాకు నాలుగు బహుమతి యిచ్చి పంపాడు.

ఒక యేణ్ణర్థమయింది నేను మళ్ళీ బెజవాడ వచ్చేటప్పటికి. సరాసరి సుబ్రమణ్యం యింటికే వెళ్ళాను, రైలు సంచి పట్టుకుని. చూడగానే నిర్మానుష్యంగా కనబడ్డది. ముందున్న చెట్లు కొన్ని వాడిపోయినాయి.ఇటూ అటూ గడ్డి.మొక్కలు అడవిలాగూ పెరిగిపోయినాయి. ఎన్నడూ లేనిది వాకిలి తలుపు దగ్గర వేసివుంది పొద్దున్న పదిగంటలకే. ఆశ్చర్యపడుతో, కనుక్కుందామని తలుపు తట్టాను. బల్లలూ, కుర్చీలూ అన్నీ మూలకి జరిపారు. చుట్టూ మధ్యా అంతా దుమ్మూ దారాలూ, రాట్నాలు, వాడు ఇల్లు మార్చి వుంటాడని వెనక్కి తిరగబోతూ వుంటే, పెద్దబ్బాయి వెనకనుంచి వస్తూ కనబడ్డాడు. అతని వాలకం చూడ్డంతోటే ఆ గృహానికి మూడిన ఆపదే అతన్ని పట్టిందని తెలుస్తోంది. తామర కాడలాగు సన్నగా వేళ్ళాడే చేతులు, కాంతికి దూరంగా పెరిగిన మొక్కలాగు జీవంలేని మొహమూ, శూన్యంతో నిండిన దృష్టులూ అన్నీ ఆ కథే చెప్పాయి. చిరిగిన జల్లెడలాగల్లిన ఖద్దరు చొక్కా వేసుకొన్నాడు. బంతిలాగు గంతులేసే కాలోంవున్న నిక్కరూ, షర్టూ మాయమైనాయి.

"జ్ఞాపక ముందిటోయ్" అంటే, మాట్లాడ్డానికి శక్తిలేని వాడివలె తల వూయించాడు.

నేను : నాన్నగా రేరీ?

కుర్రాడు : "బైటికి వెళ్ళారు"-అని లోకంతో పనిలేని ముసలి వాని వలె అక్కడే గొమ్మంలో పట్టుకుని నుంచున్నాడు.

నే : అట్లా ఉన్నావేం, ఒంటో బావుండలేదా?

కు : నాక్కాదు. తమ్ముడికి.

నే : తమ్ముడికేం?

కు : క్షయ.

నే : క్షయా? యెక్కువగా వుందా?

కు : యేమో! అమ్మ యేడుస్తోంది.

నే : నాన్నగారు డాక్టరుకోసం వెళ్ళారా?

కు : లేదు. ఇంగ్లీషు డాక్టర్లు చంపుతారు మనుష్యుల్ని.

నే : చంపుతారూ!

కు : వాళ్ళొచ్చిం తరువాతే యీ క్షయా అవీ మనదేశంలోకి వచ్చాయి.

విన్నమాట అప్పచెపుతున్నాడు. సంగతులు సగం అర్థమైనాయి నాకు.

నే : నువ్వు బడికి వెళ్ళడం లేదా!

కు : ఆ యింగ్లీషు బడికి వెళ్ళడం దేశద్రోహం-ఇంగ్లీషు వల్లనే మన దేశం బానిసదేశ మయింది.

నే : "నీకు బడి మానెయ్యడం బావుందా ?"

చప్పున అప్రయత్నంగా అతని కంటి గుడ్లలో నీళ్ళు తిరిగాయి.

కు : కాని నాకు చాలా దిగులేసింది. నేను మానేస్తానంటే మా దొరసాని యేడ్చింది. నేను కడుతున్న అట్టల వంతెన సగంలో వదిలేశాను. నాటకంలో "అల్‌ఫ్రెడ్" వేషంకూడా వెయ్యడానికి వీల్లేదు. "వొయిలెట్" కూడ నాతో వేషం వేస్తోంది. ఎన్నడూ నా జన్మలో ఆ అమ్మాయిని చూడకుండా వుండనని ఒట్టుకూడా వేశాను. యెంత యేడ్చింది! కాని దేశానికి త్యాగం చెయ్యవద్దూ?

నే : మరి చదవడమే లేదా ?

కు : ఇక్కడో కొత్తబడికి వెళ్ళాను. నా క్రాప్ చూసీ యింగ్లీషు మాటలు చూసీ, నా నడక చూసీ ఆ టీచరు యెక్కిరిస్తాడు. అందుకని మానేశాను.

నా హృదయం కరిగిపోయింది. దగ్గిర కూచో పెట్టుకుని రైలులో నేను చూసిన తమాషాలూ, విన్నమాటలూ, మా బావ మూర్ఖమూ - అన్నీ చెప్పి చాలాసేపు నవ్వించాను. ఇంతలో సుబ్రమణ్యం ముసలి తండ్రి దగ్గుకుంటో వచ్చాడు.

"యెవరదీ, మీరా? చాలా రోజులకి వచ్చారే ? మీరు మీ సీమబట్టల్ని మానెయ్యలేదే?"

నే : లేదండి. బావున్నారా?

తండ్రి : అడుగుతున్నారా, చుట్టూ కనబడటంలా మా వైభవం ? చూశారా?

ఆయన వృద్ధకంఠపు వొణుకు నాకు చాలా జాలి పుట్టించింది. పోయినసారి నేను చూచినప్పటికంటే పదేళ్ళు ముసలివాడైనాడు.

తం : నా వృద్ధాప్యం సౌఖ్యంగా, ఆనందంగా మా వాడి చేతుల్లో గడిచి పోతుందను కున్నాను. కాని విధికి కన్ను కుట్టకుండా వుంటుందా ? అంత అదృష్టాన్ని అంత కాలమూ అనుభవించనిస్తాడా? నాను-కోపరేషనట ఇదొకటి సృష్టించాడు ఓ మతిలేనివాడు. స్వదేశమని, ముతక బట్టలనీ రాయటం, మావాడి తోటి వాళ్ళందరు తాళమేసి పనులు మానుకోడం!

నెల తిరిగేటప్పటికి రెండువేలు కళ్ళ చూసేవాడండి. కోర్టుమానూ, మానూ అన్నవాడేగాని ఈనాడు ఒక పైస ఇచ్చేవాడులేడు.

యింతలో ముసలమ్మ వచ్చికూచుంది.

ముసలమ్మ : పోనీ డబ్బుపోతే పోయింది. వాడన్నా సంతోషంగా చింతలేకుండా వుంటే సంతోషిద్దును. ఆ చలాకీ, ఉత్సాహం అన్నీ పోయినాయి. దేశదారిద్ర్యం, ఈ ఊరివాళ్ళ దుర్మార్గం అన్నీ పాపం వీడి మొహాన్నే వేళ్ళాడుతున్నాయండి, తను దరిద్రుడై భార్య పుస్తెతోకూడా స్వరాజ్యనికిచ్చి మమ్మల్నీ, కాటిలో కాళ్ళు పెట్టుకున్న వాళ్ళని ఏడిపించడమా దేశదారిద్ర్యం పోగొట్టే విధం? ఇదిగో, ఈ చక్రాలు తిప్పమంటాడు పొద్దున్ననించి సాయంకాలం దాకా. యెన్నడూ లేనిది ఒకసారి ఆ చిన్న కుర్రాణ్ణి కొట్టాడు-ఏదో నూరు గజాలదూరం తియ్యలేనిది. ఈయన్ని రోజూ రొట్టే, పాలూ డాక్టరు తీసుకోమన్నాడు. అవీలేదు, యేం అంటే దేశంలో తిండి లేక వేలక వేలు, చచ్చిపోతూవుంటే మనకి రొట్టె ఎందుకంటాడు. వాడో! వాడు తిండే మానేశాడు. ఈ స్వదేశమేమిటో, ఈ గల్లంతేమిటో గాని మేం చచ్చిపోతున్నాము నాయనా!

తం : నన్ను నా పిన్నను తెచ్చుకోనీడు. ఆ దొరలందరూ ఘాతకులు, దేశ విరోధులూ, గర్విష్టులంటాడు. వీడికేం తెలుసును? నేను స్మితుదొరగారి దగ్గిర పని చేశాను. పదిహేను మంది మన వాళ్ళకిందా పని చేశాను. చెపితే వినేవాడెవడండీ? ఆ నిష్పక్షపాతం, ఆ దయా, ఆ కరెక్టునెస్ వాళ్ళకి కాక ఇంకెవరికుంది? ఆ జగన్మాత విక్టోరియారాణి పోయిన రోజున.... ఎందుకులెండి మిమ్మల్ని విసిగిస్తున్నాను గావును.

నే : లేదండి చెప్పండి.

తం : ముప్పైఏళ్ళ క్రిందలేని దేశ దారిద్ర్యం యిప్పుడే మొచ్చిందండీ? అప్పుడంతా సుఖంగా లేమూ, పూర్వం ఇంత ధనం ఉండేదాదేశంలో ? దొరలట, పంజాబులో కాల్చారట ప్రజల్నీ, తిరగబడ్డ ప్రజల్ని కాల్చకపోతే ప్రభుత్వం మెట్లానండి? ఇంక రేపణ్నించి దొంగల్ని ఖైదులో పెట్టడం, ఉరి తియ్యడం కూడ తప్పేనంటారుగావును-ఇంక ప్రభుత్వమెందుకు?

ఇంతలో సుబ్రహ్మణ్యం వచ్చాడు, మధ్యాహ్నం పన్నెండయింది. ఒళ్ళంతా చెమటపోసి మొహం యెండకొట్టింది - మనిషి సగమైనాడు, గడ్డం పెరిగింది-ఆ ముతక మురికి బట్టలేసుకొని వికృతంగా వున్నాడు. నన్ను చూడగానే సంతోషం చూపించాడుగాని-తిరిగి వానతెచ్చే మబ్బులాగు ఏదో ఆలోచన కళ్ళని కప్పింది, అతని కాళ్ళచప్పుడు విని భార్య బయటికి వొచ్చింది.

"శేషు కెట్లావుంది?"

"మళ్ళా తెరవచ్చింది. చాలా భయపడ్డాను. మీ కోసం కబురంపితే మీరు కనపళ్ళేదు"

"మా అబ్బాయికి జబ్బుగావుంది. రా" అని నన్నుకూడ గదిలోనికి తీసికెళ్ళాడు. మృత్యువా పిల్లవాడి మొహాన రాసివుంది.

"వైద్యమేమిటి?"

"వైద్యమేంచేస్తుంది? తొట్టిస్నానం చేయిస్తున్నాము. కాని ఉపయోగం కనపళ్ళేదు?"

"మదనపల్లి"

"మదనపల్లి, ఆ వెస్టరన్ నాన్సెన్సు నా ముందు మాట్లాడకు"

మృత్యువు సగం కబళించిన ఆ యింట్లో యెట్లాగో భోజనంచేసి, వాడిగదిలోకి వెళ్ళాము. మూల చాప తప్ప, ఇంక బూజా, దుమ్మూ తప్ప యేమీ లేవు ఆ గదిలో.

"నీ లైబ్రరీ. పటాలు?"

"అన్నీ అమ్మేశాను. అయిదుకోట్ల ప్రజలు మల మల మాడుతూ వుంటే-"

"ఈ చల్లనిగాలిని, బయట ఆకాశాన్ని, ఆ పున్నాగ చెట్టునీ ఎవరూ కొనలేదుగావును" అన్నాను, కడుపుమంట భరించలేక-నా వంకచూసి, "ఇంకా నన్ను వెక్కిరిస్తున్నావా, ఈ మాల గుడ్డలు కట్టుకుని?" అన్నాడు.

"నాసంగతి పోనీలే, కానీ నువ్విట్టా తయారైనావేం? దేశసేవ యే మాత్రం నీ వొంటికి, మనస్సుకీ పడ్డట్టులేదు"

"ఇంకా ఈ ఆరోగ్యమున్నందుకూ, ఆ తెల్లని బియ్యపు అన్నం తింటున్నందుకూ, నీబోటి స్నేహితులతో నాలుగు నిమిషాలు మాట్లాడినందుకూ, నా అంతరాత్మ బాధిస్తో వుంటుంది. ఇంతకాలం మన చుట్టూ ఇంత విచారం, దారిద్రమ్మూ పెట్టుకుని, నెత్తిమీద ఇంత బానిసత్వాన్ని ధరించి యెట్లా బతికామో! ఆహారం, నిద్రాలేకుండా ఎన్నేళ్లు పనిచేస్తే దేశం బైటపడుతుందోగాని!"

ఏ మాత్రమూ కాపట్యంలేని నిర్మలమైన ఉద్రేకంతో వాడి కళ్ళు మెరిశాయి. పెదిమలు వొణికాయి.

"కాని యీ క్షోభేమిటి. ఈ యిల్లేమిటి?"

"పూర్వపు దుబారా, షోకూ లేవనేనా? మరి యింకా త్యాగమంటే ఏమిటి?"

"తండ్రి సౌఖ్యం, పెండ్లాం నగలూ, పిల్లల ఆరోగ్యం - ఇదంతా త్యాగం చెయ్యడమూ, దేశసేవేనా?"

"వెక్కిరిస్తున్నావు. కాని సంబంధమేమిటి?"

"పోనీ నీకీ జీవనం ఆనందంగా వుందా?"

"ఆనందమా? ప్రస్తుతావస్తలో ఒక్క నిమిషం ఆనందంగా వుండటానికి ఎవరి కుంది హక్కు?"

"పోనీ, నీ రెండువేల ఆదాయం, నీ భార్యనగలూ, నీ ఆనందం ఇంటివారి ఆనందం, పిల్లల ఆరోగ్యం ధారపోశావు. ఎంత సహాయం అయింది దేశానికి?"

ఒక్క రవ్వసేపు కూచున్నాడు.

"అవును. అదినాకు విసుగు పుట్టిస్తుంది. అందరూ యీ నాయకులందరూ స్వార్థపరులు. ఈ నెలాదాయం నష్టంకాక, పైగా నా స్వంత సొమ్ము యిరవై వేలు యిచ్చాను. దానికి లెక్క చెప్పమంటే చెప్పరు. చివర చివరికీ చూడగా అంతా స్వలాభాపేక్ష తప్ప ఇంకేమీ లేనట్లుంది. ఒక్క పంచముల సంగతి తీసుకో. నేను పంచముల్ని రానిస్తున్న దగ్గర్నించి, ఒక్క బంధువూ యీ యింటిగడప తొక్కలేదు. అంతమాత్రం త్యాగం చేసినవాణ్ణి చూసి యిప్పటికీ యింకా చందాలు వెయ్యమనే వాడేకాని, మీ యింట్లో మేము పడే బాధలు కనుక్కునేవా డెవ్వడూ లేదు. చెత్తాకానీ మనుషులందరూ దేశయోధులిప్పుడు. నాలుగెకరాల పొలం దాచుకొని. పది రూపాయలు పని వొదులుకొని, దేశౌన్నత్యం సంగతి గట్టిగా గంటన్నర అరిచే వెంకటేశ్వర్లుకి నాకన్న గౌరవముంది. నాకు గౌరవం కావాలనికాదు. కాని-"వూరుకున్నాడు.

"నా దగ్గిర స్వరాజ్య నిధి కిచ్చిన తాలూకు సొమ్ము, నాదే. మూడువందలుంటే, దానికి ఖర్చు అడిగారు."

"పోయిన సారి నేను వచ్చినప్పుడు ప్రతి వాణ్నీ విశ్వసిస్తున్నావు. యింతలో లోకం మారలేదు కదా!"

"తెలుసుకున్నానిప్పుడు"

"ఆ విశ్వాసమే నయమేమో!"

"తెలివి తక్కువ"

"కాని ప్లీడరు పని న్యాయమే నన్నావుగా?"

"అంత నీచ మింకోటిలేదు. చిన్నప్పుడు మనమనుకున్న మాటలే నిజం"

"కానీ నీ ముసలి తండ్రి, నీ భార్య, పిల్లలు-ఎవరికీ యిష్టంలేనట్టుంది"

"మూర్ఖులు, వూరికే సౌఖ్యాలు మరిగి-"

"కాని వాళ్ళ సౌఖ్యంకూడా పాడుచెయ్యడానికి నీకేమధికారముంది?"

"ఈ బీదలు తిండిలేక మాడుతూవుండగా, సుఖపడ్డానికి వాళ్ళకేం హక్కు వుంది?"

"కానీ వీళ్ళా కారణం?"

"అందరమూనూ"

ఇంకా ఆ పిచ్చివాడితో మాట్లాడేదేమిటని వూరుకున్నాను.

అతని పెద్దకుర్రవాడొచ్చి భయపడుతో "నాన్నా, నాకు కథల పుస్తకం తెచ్చిపెడతా నన్నారు. తెచ్చారా?" అన్నాడు.

"జ్ఞాపకం లేదు"

"పోనీ, నేను మా స్కూలుకి పోయి-"

"వెధవా ఆ స్కూలు సంగతి మళ్ళా ఎత్తావంటే"

పిల్లిలాగు ఒదిగి వెళ్ళిపోయినాడు.

"కానీ నీ స్వభావమెంత మారిపోయిందో తెలుసా? ఈనీ అవిశ్వాసమూ, నీ చిరాకూ, నీ తలిదండ్రులమీద కోపమూ-"

"ఏం చెయ్యను? ఈ దారిద్ర్యం, ఈ ఆకలి"....వూరుకున్నాడు.

సాయంత్రం చెట్టుక్రింద దిగులుగా నుంచుని దీపంవేసి ఆ యింటికేసి చూస్తున్నాడు. సుబ్రమణ్యం యేదో మీటింగుకుపోయినాడు. మెల్లిగా నాకేసి ఎవరో వస్తున్నారు.

దగ్గిరికి వచ్చి, "ఒక్క ఐదురూపాయలుంటే ఇవ్వరూ?" అంది సుబ్రమణ్యం భార్య సిగ్గుతో తలవంచుకొని.

"ఇంట్లో సంచిలో ఉన్నాయి. అబ్బాయి చేతికిచ్చి పంపుతాను. ఐదు చాలా?"

"పది వుంటే ఇవ్వండి. అబ్బాయికివ్వవద్దు. తరువాత వీలుచూచుకుని, ఎవరికీ తెలీకండా నాకే ఇవ్వండి."

అటు తిరిగి మళ్ళీ అంది. "ఇప్పుడు జేబులో ఒక పావలా అన్నాలేదా?"

సుబ్రమణ్యం భార్య!

కిందపడి యాడవాలని పించిందినాకు.

"లేదమ్మా! ఇప్పుడే నేనే తెచ్చిఇస్తాను. ఇక్కడే వుండండి"

"వొద్దు జేబులో ఉంచుకోండి. నేనే వచ్చి అడుగుతాను" అని మెల్లిగా చీకట్లోకి, ఆ మృత్యుగృహంలోకి దెబ్బలు తిన్న దెయ్యం మల్లే వెళ్ళింది.

◆ ◆ ◆

*రచనా కాలం : 1927, ప్రచురణ : (ఆ రాత్రికథలు) ఎమెస్కో 1971*